


పరిహారం పెంచాలని ఎంఎల్ఎకు వినతి



వినతి అందిస్తున్న జీలుగుమిల్లి వాసులు

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి మీదుగా జాతీయ రహదారి నిర్మాణంలో స్థలాలు, దుకాణాలు కోల్పోతున్న తమకు పరిహారం పెంచాలని యజమానులు ఎంఎల్ఎ చిర్రి బాలరాజును కోరారు. శుక్రవారం వారు ఎంఎల్ఎను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన కూడలిలో ఉన్న జగదాంబ, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలను ప్రజలకు అనుకూలమైన ప్రదేశంలో నిర్మించేలా చూడాలని కోరారు. ఈ మేరకు ఎంఎల్ఎకు వినతిపత్ర అందజేశారు. దీనిపై ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టిలో పెడతానన్నారు. కార్యక్రమంలో జి.రవికుమార్, కె.రాము, కె.చక్రి, సూరిబాబు, చంద్రరావు, ఎస్.చెన్నారావు, శ్రీను, కిషోర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జెడ్‌పిలో జరిగేదేంటి..?

నేడు జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం

జెడ్‌పి ఛైరపర్సన్ తీరుపై గతంలో వైసిపి సభ్యుల నోటీసు

సమావేశంలో చర్యలకు పట్టుబడతారా.. మౌనం వహిస్తారా?



ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా ప్రద్మశ్రీ టిడిపిలో చేరడంపై వైసిపి జెడ్‌పిటిసి సభ్యులు అప్పట్లో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆమెపై అనర్హత వేటు వేయాలంటూ దాదాపు 30 మంది వైసిపి సభ్యులు డిమాండ్ చేయడంతోపాటు జెడ్‌పి సిఇఒకు వినతిపత్రం అందించారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ప్రత్యేక సమావేశానికి తేదీ ప్రకటించినప్పటికీ ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో చివరి నిముషంలో రద్దు చేశారు. జిల్లా పరిషత్‌కు చేరుకున్న వైసిపి సభ్యులు అధికారులతో వాగ్వివాదానికి దిగిన సంగతి తెలిసిందే. ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని రాతపూర్వక హామీ ఇచ్చిన తర్వాత వారంతా ఆందోళన విరమించారు. ఈ నెల 12వ తేదీతో ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో 21వ తేదీ ఉదయం జెడ్‌పి ప్రత్యేక సమావేశం, మధ్యాహ్నం నుంచి సాధారణ సమావేశం జరపనున్నట్లు జెడ్‌పి అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం జరగనున్న ప్రత్యేక సమావేశంలో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

అవిశ్వాస తీర్మానం ఇచ్చినా చెల్లుబాటు కాదు!

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన వారిపై నాలుగేళ్ల వరకూ అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదని చట్టం చెబుతోంది. అనర్హత వేటు ప్రతిపాదన సైతం జరిగే అవకాశం లేదు. ప్రత్యేక సమావేశంపై కొద్దిరోజుల క్రితం పెద్దఎత్తున గలాటా చేసిన వైసిపి సభ్యులు ఇప్పుడు మౌనంగా ఉన్నారు. దీంతో శనివారం సమావేశంలో ఎవరూ మాట్లాడే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయంగా ఒకరిద్దరు మాట్లాడినా పెద్దగా ఇబ్బంది పట్టించుకునే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

సహకార సంఘాలకు మళ్లీ ఇన్‌ఛార్జులే

నిరాశలో కూటమి నేతలు



ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాల ఎన్నికలను ఇప్పట్లో జరిపే అవకాశం లేనట్లు తేలిపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సహకారం సంఘాలకు ఎన్నికలు జరపకుండా ప్రత్యేక అధికారులను నియమించింది. డిసెంబర్ 21వ తేదీతో ప్రత్యేక అధికారుల పాలనా కాలం ముగిసిపోతుంది. నీటిసంఘాల ఎన్నికలు పూర్తి కావడంతో సహకార సంఘాల ఎన్నికలను సైతం ప్రభుత్వం పూర్తి చేస్తుందని అంతా భావించారు. ప్రభుత్వం మాత్రం మళ్లీ ప్రత్యేక అధికారుల పాలనవైపే మొగ్గు చూపింది. మరో ఆరు నెలలు ప్రత్యేక అధికారులను కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో మరో ఆరులనెలలపాటు సహకార సంఘాలకు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. 2013లో సహకార సంఘాల ఎన్నికలు జరగ్గా, 2018లో పదవీ కాలం పూర్తయ్యింది. ఆ తర్వాత వచ్చిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించలేదు. వైసిపి ప్రభుత్వం త్రిసభ్య కమిటీలతో ముందుకు సాగింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనతో ముందుకు సాగుతోంది.

ఏలూరు జిల్లాలో 159 సహకార సంఘాలు ఉండగా, పశ్చిమలో 122 ఉన్నాయి. రెండు, మూడు సహకార సంఘాలకు ఒక్కరే పర్సన్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. దీంతో అన్ని పనులు చూసుకోవడం ప్రత్యేక అధికారులకు ఇబ్బందిగా మారింది. ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాప్రతినిధుల పాలన సాగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం అందుకు భిన్నంగా ముందుకు సాగుతుండటం రైతుల్లో చర్చనీయాంశంగా మారింది.అంతేకాకుండా సహకార సంఘాల పదవుల కోసం కూటమి నేతలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. మరోసారి ప్రత్యేక అధికారులను నియమించడంతో నాయకులంతా తీవ్ర నిరాశలో కూరుకుపోయారు.

విద్యుత్ భారాలను ఉపసంహరించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన



ద్వారకాతిరుమల: నినదిస్తున్న నేతలు, ప్రజలు

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

పెంచిన విద్యుత్ భారాలను ఉపసంహరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం తుక్కులూరు గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ ప్రజలు మోయలేని విధంగా విద్యుత్ భారాలను మోపడం దారుణమన్నారు. తక్షణం ఆ భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జోజి బాబూరావు, ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: పెంచిన విద్యుత్ భారాలను వెంటనే తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలను ఎత్తివేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన గొల్లగూడెంలోని సుందరయ్య నగర్‌లో శుక్రవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, నేతలు ముత్యాల నరేష్, ఎం.కృష్ణ, టి.గురవయ్య, నవీన్, కనకారావు, తిరుపతమ్మ, వెంకటేశ్వరమ్మ, కుమారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అదానీ కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఎం.నాగులపల్లిలో రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేత కట్టా భాస్కర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి కరెంటు ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చాక మాట మార్చారని విమర్శించారు. నాడు స్మార్ట్ మీటర్లను బద్దలుగొట్టిన లోకేష్ నేడు అదే స్మార్ట్ మీటర్లను బిగించడానికి అనుమతిచ్చి ప్రజలు మోసగిస్తున్నారన్నారు. తక్షణమే పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు పోలుకొండ నాగరాజు, పదిలం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

చివరి అంకానికి సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ - పశ్చిమలో ఒకటి, ఏలూరులో రెండు ప్రాజెక్టు కమిటీలు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరింది. ఈ నెల 14న వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరగ్గా, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు జరిగాయి. మూడో దశ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు శనివారం నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పశ్చిమలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు భీమవరంలోని కలెక్టరేట్‌లో జరగనుండగా, ఏలూరు జిల్లాలోని తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో, ఎర్రకాలువ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయంలో జరిపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు ఎన్నుకోనున్నారు. ఏలూరు జిల్లాలోని ప్రాజెక్టు కమిటీలు మీడియం ఇరిగేషన్‌కు సంబంధించినవి కావడంతో జిల్లాలో ఎన్నికైన వాటర్ యూజర్ అసోసియేషన్ కమిటీల అధ్యక్షులు ఎన్నుకోనున్నారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. పశ్చిమగోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా ఇద్దరు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. పాలకోడేరుకు చెందిన మురళీకృష్ణంరాజు, నరసాపురం నాయకుడు పోత్తూరి రామరాజు ఆ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. టిడిపి నాయకత్వం మురళీకృష్ణంరాజువైపే మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. ఏలూరులోని ప్రాజెక్టు కమిటీలు మీడియం కావడంతో ఇక్కడ పెద్దగా పోటీ లేదు. అధినాయకత్వం నిర్ణయించిన వారే కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికయ్యే అవకాశం ఉంది.

యువతకు బంగారు భవిష్యత్తు కోసం కృషి

మెగా జాబ్‌మేళా ప్రారంభ సభలో మంత్రి కొలుసు పార్థసారధి



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

ప్రపంచస్థాయి సాంకేతికతను రాష్ట్రానికి తీసుకొచ్చి యువతకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. స్థానిక ట్రిపుల్ ఐటిలో శుక్రవారం 'మెగా జాబ్‌మేళా'ను ఆయన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేలా ప్రత్యేక పారిశ్రామిక పాలసీని రూపొందిస్తున్నామన్నారు. జనాభా లెక్కల వలె నైపుణ్య లెక్కలు నిర్వహించి ప్రతి ఇంట్లో యువత ఏ అంశంలో నైపుణ్యం కలిగి ఉన్నది సర్వే చేపడుతున్నామన్నారు. ప్రపంచస్థాయి దిగ్గజ సంస్థలు, అదేస్థాయి టెక్నాలజీతో తమ యూనిట్లను మన రాష్ట్రంలో నెలకొల్పి మన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా చంద్రబాబు, లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎనిమిది స్కిల్‌హబ్స్‌లో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో ఏ పరిశ్రమల్లో ఏఏ ఉద్యోగావకాశాలు ఉన్నాయి, వాటికి ఏఏ విభాగంలో నైపుణ్యం అవసరం అని తెలుసుకుని వాటిలో యువతకు శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు.

కలెక్టర్ పనితీరును ప్రశంసించిన మంత్రి పార్థసారధి

ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పని చేస్తున్నారని మంత్రి పార్థసారధి ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పేదలకు అవగాహన కల్పించి వాటిని వారు సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. అనంతరం జాబ్‌మేళాకు విచ్చేసిన అభ్యర్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి మరిన్ని హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ట్రిపుల్ ఐటి విసి అమరేంద్రకుమార్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జితేంద్రకుమార్ పాల్గొన్నారు.

571 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 1256 మంది యువత హాజరయ్యారని, 571 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్ర బాబు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 34 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని చెప్పారు.

నెంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతా

సిటీ స్కాన్, మౌలిక సదుపాయాలు కల్పిస్తా

7న కొత్త భవనం ప్రారంభం

ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పార్థసారధి



ప్రమాణస్వీకారం చేస్తున్న మంత్రి, సభ్యులు

ప్రజాశక్తి – నూజివీడు టౌన్

స్థానిక ఏరియా ఆసుపత్రికి వచ్చే ఏఒక్క రోగీ ఇబ్బంది పడకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా నూజివీడు ఏరియా ఆసుపత్రిని జిల్లాలో నెంబర్‌వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రజలకు నమ్మకం పెంచేలా పని చేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అత్యవసర చికిత్స కోసం నూజివీడు ఏరియా ఆసుపత్రికి వచ్చిన ఏ రోగినీ ఇతర ఆసుపత్రులకు పంపకుండా అత్యుత్తమ వైద్య సేవలందించేలా సిబ్బంది పని చేయాలని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి మంజూరయ్యేలా చూస్తానన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకెళ్లాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స అందించాలన్నారు. ఆసుపత్రిలో కొత్త భవనం నిర్మించి ఏడు నెలలైనా ఇంకా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఫినిషింగ్ పనులు ఉన్నాయని అధికారులు తెలపగా, జనవరి ఏడో తేదీన వైద్య ఆరోగ్య శాఖామంత్రితో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా మంత్రి పార్థసారధి, సభ్యులుగా ఇళయరాజా, వెంకటకామేష్, డాక్టర్ ఝాన్సీరాణి, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డాక్టర్ నాదెండ్ల శ్రీకాంత్, గొల్ల దుర్గాదేవి, మెంబెర్స్ కన్వీనర్‌గా డాక్టర్ నరేంద్రసింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ పాల్ సతీష్, ఎపి ఎంఐడిసిఐ కె.నాగార్జున, డాక్టర్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించొద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

పెదవేగిలోని ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించొద్దని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రోజురోజుకీ ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెరుగుతోందని, దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ఉందని పేర్కొన్నారు. సహకార రంగంలో ఉన్న ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయకుండా ప్రయివేటీకరించాలనే ప్రభుత్వ యోచన విరమించుకోవాలని కోరారు. ఒకవైపు ప్రయివేట్ ఫ్యాక్టరీలు లాభాలు గడించి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తుంటే పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారం అభివృద్ధికి నోచుకోకపోవడం, పాలకులు ఆధునికీకరించకపోవడం అన్యాయమని విమర్శించారు. పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారంలో వస్తున్న రికవరీ శాతం ఆధారంగానే ధర నిర్ణయం జరుగుతుందని చెప్పారు. తెలంగాణ రికవరీ శాతంపై ఆధారపడి ధర నిర్ణయించడం ఏమిటని ప్రశ్నించారు. పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరిస్తే ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన



ఏలూరు అర్బన్ : సిఐటియు ఆధ్వర్యాన నిరసన



బుట్టాయగూడెం: కెవిపిఎస్ ఆధ్వర్యాన..

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

నిండు పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపరుస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడడాన్ని నిరసిస్తూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు కొత్త బస్టాండ్ ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. తొలుత సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ వద్దకు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి ప్రసాద్‌లు మాట్లాడుతూ బిజెపి మొదటి నుంచి రాజ్యాంగాన్ని మార్చడం కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉందని, దానిలో భాగంగానే అంబేద్కర్‌పై దాడి చేస్తున్నారన్నారు. ఈ దాడి రాజ్యాంగం మీద దాడిగా అభివర్ణించారు. తక్షణమే కేంద్ర హోం మంత్రి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు నారపల్లి రమణారావు, కె.పోచమ్మ, ఎం.దుర్గారావు, జి.రవి కిషోర్, బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, జి.గోపి, తులసి, విమల పాల్గొన్నారు.

రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ని అవహేళన చేస్తూ మాట్లాడటాన్ని ఖండిస్తూ శుక్రవారం ఏలూరు పాత బస్‌స్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్‌సి, ఎస్‌టి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జెఎసి నాయకులు చాగంటి సంజీవ్, పల్లెం ప్రసాద్, నేతల రమేష్ బాబు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం : గిరిజన సంఘం ఆధ్వర్యాన..

బుట్టాయగూడెం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడారు. సీనియర్ దళిత నాయకులు టి.రాజు పాల్గొన్నారు.


కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శనా ర్యాలీ నిర్వహించారు. ధర్ముల రమేష్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరావు, చుండ్రు బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, గిరిజన జ్యోతి అధ్యక్షులు కూరం సత్యనారాయణ పాల్గొన్నారు.



ఏలూరు అర్బన్ : దళిత సంఘాల ఆధ్వర్యాన నిరసన

ప్రశ్నా పత్రాలను పాఠశాలలకే అందించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఎంఇఒ కార్యాలయంలో నిరసన



ఎంఇఒకు వినతిని అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి – ముసునూరు

పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్ష సమయానికి ఒక గంట ముందే ఉపాధ్యాయులు పాఠశాలకు తీసుకువెళ్లాలని ఉన్నతాధికారుల నిర్ణయాన్ని యుటిఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుడిమేళ్ల రాంబాబు అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మండల విద్యాశాఖ అధికారి బివిఎస్ సుబ్బారావుకు యుటిఎఫ్ నాయకులు వినతిని అందించారు. ఈ నిర్ణయం వల్ల ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పద్మ కిషోర్, ప్రధాన కార్యదర్శి గుడిమెళ్ల రాంబాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిత్తూరు జిల్లాలో సిద్దయ్య శెట్టి అనే ఉపాధ్యాయుడు పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా పత్రాలు పాఠశాలకు సమయానికి తీసుకెళ్లాలనే ఆందోళనలో రోడ్డు ప్రమాదానికి గురై, తన ప్రాణాలను కోల్పోవడం చాలా బాధాకరమని విచారాన్ని వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రం లీకైతే దానికి సంబంధించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలే కానీ, ఉపాధ్యాయుల మొత్తాన్ని ఒత్తిడికి గురిచేయటం మంచిది కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్ఐసి నిర్వీర్యం తగదు

ఎల్ఐసి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.రవి కిషోర్



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న బ్రాంచ్ కన్వీనర్ రాంబాబు

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ఎల్ఐసి సంస్థను నిర్వీర్యం చేయడానికి ఐఆర్‌డిఎ తీసుకున్న ప్రతిపాదనలను వ్యతిరేకించాలని, చలో పార్లమెంట్ ధర్నాకు ఏజెంట్లు అందరూ కలిసి రావాలని ఎల్ఐసి ఎఒఐ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.రవి కిషోర్ పిలుపునిచ్చారు. ఎల్ఐసి ఎఒఐ 21వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏలూరు బ్రాంచ్ కార్యాలయం దగ్గర జెండా ఆవిష్కరణ జరిగింది. బ్రాంచ్ కన్వీనర్ కోడె రాంబాబు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని, ఈ పోరాటానికి ఏజెంట్లు అందరూ నాయకత్వం వహించాలని కోరారు. పోరాడితేనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని, కేంద్ర కమిటీ ఇచ్చే ప్రతి పిలుపుని బ్రాంచ్ స్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు. ఈనెల 10న జరిగిన డివిజన్ ధర్నాలో పాల్గొని జయప్రదం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కమిటీ నాయకులు డివి.రామకృష్ణ, జోనల్ నాయకులు బి.రామ్మోహన్‌రావు, డివిజన్ నాయకులు పి.సాంబశివరావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్, బ్రాంచ్ ఎబిఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'జాతీయ ముసాయిదా ఫ్రేమ్‌వర్క్‌ను ఉపసంహరించాలి'

ఏలూరు అర్బన్ : వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించాలని, రైతుల ప్రయోజనాలు బలిపెట్టి కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే చర్యలు ఆపాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ఎస్‌కెఎం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈనెల 23న యునైటెడ్ కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపు మేరకు వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధానం ముసాయిదా పత్రాలను దహనం చేయాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనారాయణ, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్పొరేటీకరణ ఆపాలని కోరారు. సమావేశంలో తామా ముత్యాలమ్మ, గుడిపల్లి వెంకట్రావు, అందులు ప్రభాకర్ పాల్గొన్నారు.

'వ్యకాస రాష్ట్ర సమావేశాలు జయప్రదం చేయాలి'

ఏలూరు అర్బన్ : వచ్చే జనవరి 4, 5, 6 తేదీల్లో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అన్నే భవనంలో సంఘం రాష్ట్ర సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనారాయణ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి వ్యవసాయ రంగం అభివృద్ధితో ముడిపడి ఉందన్నారు. సంఘం రాష్ట్ర స్థాయి సమావేశాలు అన్నపూర్ణగా పేరుగాంచిన ఏలూరులో జనవరి 4, 5, 6 తేదీల్లో జరుగనున్నాయని, వీటికి రాష్ట్రవ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు తామా ముత్యాలమ్మ, అందులు ప్రభాకర్, వై.సీత, జి.వెంకట్రావు, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు టౌన్ : నూజివీడు సబ్ కలెక్టర్‌గా నియమితులైన బచ్చు స్మరణ్ రాజ్ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని శుక్రవారం నూజివీడు ట్రిపుల్ ఐటిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వికి పూలమొక్కను అందజేశారు. విధుల్లో చేరిన సబ్ కలెక్టర్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సివిల్స్ 676 ర్యాంక్ విజేత అయిన స్మరణ్ రాజ్(2022 ఐఎఎస్ బ్యాచ్) చెన్నై ఐఐటిలో కెమికల్ ఇంజనీరింగ్(బిటెక్) పూర్తిచేశారు. స్మరణ్ రాజ్ ఇప్పటి వరకు అనకాపల్లి అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇప్పటి వరకు నూజివీడు ఆర్‌డిఒగా పనిచేసిన ఎం.వాణి సిసిఎల్ఎ మంగళగిరికి బదిలీ అయ్యారు.

ఉపాధ్యాయుడు రమేష్ అనారోగ్యంతో మృతి

ఆగిరిపల్లి : మండల పరిధిలోని పాత సూరవరం ఎంపిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కంపా రమేష్(52) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం విజయవాడలోని యనమలకుదురులోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమారుడు కలరు. ఆయన భౌతికకాయాన్ని ఆగిరిపల్లి మండల విద్యాశాఖాధికారులు కె.నరేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్, యుటిఎఫ్, ఎస్‌టియు, పిఆర్‌టియు నాయకులు సందర్శించి, నివాళులు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మేఘా గ్యాస్ ఆధ్వర్యాన మ్యాక్ డ్రిల్

ఆగిరిపల్లి : పైప్‌లైన్ వద్ద సహజ వాయువు లీకేజీపై చేపట్టవలసిన ప్రమాద నివారణా చర్యల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించటమే లెవెల్-3 మ్యాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని మేఘా గ్యాస్ చొప్పదండ్ మదర్‌స్టేషన్ ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి రవి కిరణ్ అన్నారు. శుక్రవారం మేఘా గ్యాస్ ఆధ్వర్యంలో నాచురల్ గ్యాస్ లీకేజీవల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చేపట్టవలసిన ప్రమాద నివారణా చర్యల పట్ల మ్యాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీనివాస్, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ రాజు, గెయిల్ డిజిఎం తివారీ, ఎస్ఎఫ్ఎ జాన్ అఫ్సర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారి బుచ్చిబాబు, వైద్యాధికారి డి.రాజా, మేఘా గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా గడువు పొడగింపు

నూజివీడు టౌన్ : పంటల బీమాకు సంబంధించి బీమా గడువు మొక్కజొన్న, మినుము, పెసర, వరి పంటలకు ఈనెల 30 వరకు పొడిగించడం జరిగిందని, ఈ అవకాశం రైతులు సద్వినియోగపరుచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాష తెలిపారు. నూజివీడు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్ర (గ్రామ సహాయకులకు) జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ భాష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిఎం కిసాన్ పథకం, ఇకెవైసి కాని రైతులు అందరూ దగ్గర్లో ఉన్న రైతు సేవా కేంద్రాలలో ఇకెవైసి పూర్తి చేసుకుని లబ్ధి పొందాలని తెలిపారు. రబీ సీజన్‌లో ఇ-పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని రైతు సేవా కేంద్ర ఇన్‌ఛార్జులకు ఆదేశించారు. అనంతరం ఐఎల్ ల్యాబ్ సందర్శించి, పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు జి.విద్యాసాగర్, మండల వ్యవసాయ అధికారులు ఎ.వామండేశ్వర్, పి.చెన్నారావు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎంపిపి

చింతలపూడి : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి ప్రజలకు తెలియజేయాలంటే అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి రాంబాబు అన్నారు. మండలంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ ప్రోటోకాల్ కచ్చితంగా పాటించాలని, సచివాలయంలో సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు, నెలకు ఒకసారి రివ్యూ కార్యక్రమం నిర్వహించాలి అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, డిటి షకీలా, మండల అధికారులు పాల్గొన్నారు.

'అర్హులకు సిఎం సహాయ నిధి మంజూరుకు కృషి'

భీమడోలు : రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరుకు కృషి చేస్తానని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భీమడోలు మండలానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సిఎం సహాయనిధి మంజూరైన రూ.2,16,775 పత్రాలను అందజేశారు. దీనిలో భాగంగా పోలసానిపల్లికి చెందిన షేక్ సమీమున్నీసా బేగంకు రూ.60 వేల మంజూరు పత్రాలను, పొందూరి రమేష్‌కు మంజూరైన రూ.81,392 మంజూరు పత్రాలను ఆ గ్రామ సర్పంచ్ దంపతులు షేక్ రహీమా బేగం హసేన, షేక్ హసేన్‌తో పాటు షేక్ భాజా, ఇతర ప్రముఖులతో కలిసి ఎంఎల్ఎ సంయుక్తంగా అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన పొందూరి రమేష్‌కు మంజూరైన అర్జునరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. గుండుగొలనుకు చెందిన బి.దుర్గా ప్రసాద్‌కు మంజూరైన రూ.35,383 పత్రాలు, పూళ్లకు చెందిన వై.నరసింహకి మంజూరైన రూ.40 వేల పత్రాలను సంబంధీకులకు ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకుల ద్వారా అందజేశారు.

సిబ్బంది సంక్షేమమే లక్ష్యం : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : జిల్లా పోలీస్ యూనిట్ హోంగార్డు యూనిట్, ఏఆర్ యూనిట్‌లో పని చేసే సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పోలీసు సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని ఈ శుక్రవారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని సిబ్బంది తెలిపిన సమస్యలను విని వెంటనే వాటిని పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నేరాలు - ఘోరాలు

కింద పోర్షన్‌కు తాళాలు వేసి, పైన పోర్షన్లో నిద్రిస్తున్న సమయంలో కింద పోర్షన్లో దొంగలు పడి దాదాపు 80 గ్రాముల బంగారం అపహరించిన సంఘటన ఏలూరు ఒకటో పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో పంపుల చెరువు పక్కనే కృష్ణా జిల్లా ఉంగుటూరు ఎంజిఒ, రామాలయం సింగ్ తన భార్యతో కలిసి జీవిస్తున్నారు. ఈ క్రమంలో రోజు లాగే కింద పోర్షన్ అతను తాళాలు వేసి భార్యతో కలిసి పైన పోర్షన్లో నిద్రకు ఉపక్రమించారు. ఉదయం లేచి చూసేసరికి తలుపులు పగులగొట్టి ఇంట్లోని ఉండవలసిన 80 గ్రాముల బంగారు ఆభరణాలు, 1/2 కేజీ వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటో పట్టణ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలమైన అడ్మినిస్ట్రేటివ్ భవనం

నూతన భవనం నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

మొండూరు గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - దెందులూరు

మండలంలోని మొండూరు గ్రామ పరిధిలో పోలవరం కుడి కాలువ దగ్గర సుమారు 40 ఏళ్ల నాడు అప్పటి ప్రభుత్వం కొంత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ బ్యాంక్ రుణ సౌకర్యంతో సామూహిక కోళ్ల ఫారాలు నిర్మించి ఇచ్చింది. నిరుద్యోగ లబ్ధిదారులు ఈ ఫారాలను కొంత కాలం నిర్వహించి వచ్చిన లాభాలలో కొంత సొమ్మును బ్యాంక్ రుణం కింద జమ చేయకుండా బ్యాంక్‌లో డిపాల్టర్‌లుగా మిగిలిపోయారు. దీంతో లబ్ధిదారులకు ఫారాల నిర్వహణకు కావాల్సిన పెట్టుబడి లేక ఒక్కొక్కరూ కోళ్ల ఫారాల నిర్వహణ గాలికొదిలేసి, రుణం ఇచ్చిన బ్యాంక్‌కు మొహం చాటేసారని సమాచారం. కొన్నాళ్లకు ఫారాలను వదిలి స్వగ్రామాలకు వెళ్లిపోయారు. దీంతో కోళ్ల ఫారాల షెడ్‌లు శిథిలమై కనుమరుగై పోయాయి. కొంత కాలానికి ఆ భూమిని ఆక్రమించేందుకు కొంతమంది చేసిన ప్రయత్నాన్ని లబ్ధిదారులు తెలుసుకుని, అడ్డుకుని కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ప్రస్తుతం సామూహిక కోళ్ల పెంపక కేంద్రం భూమిలో ఆ రోజుల్లో నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ భవనం నేడు శిథిలమై పోయింది. నేడు ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు మొలిచి నిర్మానుష్యంగా మారింది. ఇప్పటికైనా ఇక్కడ నూతన భవనాలు నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలమైన అడ్మినిస్ట్రేటివ్ భవనం

20 నుంచి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

ఆర్‌టిసి సేవలు వినియోగించుకోవాలి

జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్ వరప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జిల్లా వ్యాప్తంగా కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను ఈనెల 20వ తేదీ నుంచి 2025 జనవరి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్ వరప్రసాద్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి నెలల్లో క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి సందర్భంగా బంధువులకి, మిత్రులకి శుభాకాంక్షలతో పాటు ఆత్మీయతను అందించే విధంగా బహుమతులు, కొన్ని ఆహార పదార్థాలు పంపిస్తూ ఉంటారన్నారు. దానికి అనుగుణంగా ఎపిఎస్‌ఆర్‌టిసి కార్గో ద్వారా ఈనెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకూ ఒక కేజీ నుంచి 50 కేజీల వరకు, ఒక కిలోమీటర్ నుంచి పది కిలోమీటర్ల వరకు ఉచిత డోర్ డెలివరీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఉభయగోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంబరాలు పెద్ద ఎత్తున జరుగుతాయని, హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉభయగోదావరి జిల్లా వాసులు తమ తమ సొంత గ్రామాలకు చేరుకుంటారు కాబట్టి ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలకి హైదరాబాద్ నుంచి జనవరి 9 వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ వరకు బిహెచ్‌ఇఎల్, ఇతర ప్రాంతాల నుంచి దాదాపు 117 బస్సులు ఆన్లైన్ రిజర్వేషన్ ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిధంగా జనవరి 15వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకూ హైదరాబాద్ తిరుగు ప్రయాణానికి 93 బస్సులు ఏర్పాటు చేశామని, ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు పెంచడం జరుగుతుందన్నారు. ఒకేసారి రాను, పోను రిజర్వేషన్ చేయించుకున్న వారికి పది శాతం చొప్పున రిజర్వేషన్ సౌకర్యంలో రాయితీ లభిస్తుందని, అంతేకాక ఈ ప్రయాణానికి ఏవిధమైన అదనపు ఛార్జీలు కూడా లేవని తెలిపారు. ఇంత మంచి అవకాశం కేవలం ఆర్‌టిసి మాత్రం ఇస్తుందని తెలియజేశారు. కారుణ్య నియామకం కింద 9 మందికి ఎంపిక ప్రక్రియ జరిగిందని, త్వరలో వారికిచ్చిన ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడానికి చేరుతారని తెలిపారు. రాబోయే క్రిస్మస్, నూతన సంవత్సర, సంక్రాంతి సమయాల్లో ప్రయాణాలతోపాటు పార్సిల్ సర్వీసులకు కూడా ఆర్‌టిసి సేవలు ఉపయోగించుకోవాలని వరప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, కార్గో కమర్షియల్ మేనేజర్ సుబ్బారావు, పిఆర్‌ఒ నరసింహం పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి వరప్రసాద్

సింగపూర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన వరద బాధితులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సింగపూర్ రెడ్ క్రాస్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ, జిల్లా రెడ్‌క్రాస్ శాఖ ఆధ్వర్యంలో పెదపాడు మండలంలోని అప్పన్న వీడు, తాళ్లమూడి, గోగుంట, సత్యవోలు, నాయుడు గూడెం గ్రామాల్లోని ఇటీవల సంభవించిన రామిలేరు వరద బాధితులకు ఆరు వందల మందికి దోమల తెరలు, దుప్పట్లు, టవల్‌తో కూడిన కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగపూర్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి సత్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఏ విపత్తులు సంభవించినా, బాధితులకు సింగపూర్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారం ఉంటుందని, గతంలో కరోనా సమయంలో సింగపూర్ నుంచి ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, కరోనా మెడిసిన్ కిట్లను పంపిణీ చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వరద బాధితులకు దోమల తెరలు, దుప్పట్లు, టవల్‌తో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నామని, అందులో భాగంగా ఏలూరు జిల్లాలో 600 కుటుంబాలకు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు తహశీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి, పద్మజావాణి, రెడ్ క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ వర ప్రసాద్ రావు పాల్గొన్నారు.

నిడమర్రు ఎంఇఒలుగా శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్

ప్రజాశక్తి - భీమడోలు

నిడమర్రు మండల విద్యాశాఖాధికారులు నెంబర్ ఒకటి, రెండుగా భీమడోలులో పనిచేస్తున్న ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎవిఎస్ఎన్.భాస్కర్ కుమార్ నియమితులయ్యారు. వీరు భీమడోలుతో పాటు నిడమర్రు మండలం విద్యాధికారులుగా అదనపు బాధ్యతలను స్వీకరించామన్నారు. ఈ నేపథ్యంలో ఇంత వరకు భీమడోలుతో పాటు ఉంగుటూరు నెంబర్-2 విద్యాధికారిగా పనిచేస్తున్న భాస్కర్ కుమార్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. గతంలో భీమడోలుతో పాటు ద్వారకాతిరుమల మండలం నెంబర్ ఒకటి విద్యాధికారిగా పనిచేసిన శ్రీనివాసరావు ఇప్పటికే ద్వారకాతిరుమల నుంచి రిలీవ్ అయ్యారు. ప్రస్తుతం వీరు ఇరువురూ నిడమర్రు మండల విద్యాధికారులుగా శనివారం బాధ్యతలను స్వీకరించనున్నారు.



మండల విద్యాశాఖాధికారులు 1, 2 శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్

మామిడిలో సస్యరక్షణ చర్యలు

నూజివీడు టౌన్: ప్రస్తుతం మామిడి తోటలు పూమొగ్గ దశ, పచ్చిపూత దశ, పూత దశలో వున్న దృష్ట్యా ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త బికెయం లక్ష్మి వెల్లడించారు. రాష్ట్రంలో మామిడి సుమారు 3.98 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులో ఉందన్నారు. ప్రస్తుతం నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడినటువంటి అల్పపీడనం వల్ల గత 2-3 రోజులుగా రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురవటం జరిగిందని, అదేవిధంగా అల్పపీడన ప్రభావం వల్ల గత 2-3 రోజులుగా అత్యల్ప ఉష్ణోగ్రతలు 22.4సి-25.1సి నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ దృష్ట్యా ప్రస్తుత వాతావరణ పరిస్థితులు(మబ్బులు లేదా ముసురుతో కప్పబడిన వాతావరణం) వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి, తెగుళ్ల ఉధృతి అధికమయ్యే అవకాశం వుందన్నారు. కావున రైతులందరూ నూజివీడు మామిడి పరిశోధన స్థానం, వారి సూచనలను పాటించి చీడ పీడలను నివారించుకోవాలని ఆమె కోరారు. మామిడి తోటలు పూమొగ్గ దశలో ఉన్నట్లయితే తేనె మంచు పురుగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ, క్లోరోథలోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మామిడి తోట పచ్చిపూత దశలో వున్నట్లయితే తేనె మంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు థయామిథాక్సవ్ 0.3 గ్రాములు లేదా బుప్రోఫెజిన్ 1.5 మి.లీ, హెక్సాకోనజూల్ 2 మి.లీ లేదా కార్బండజిమ్స్, మాంకోజెబ్ కలిపి 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం తోటకు నీరు అందించడం నిలిపివేయాలని, తోటలను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ముదినేపల్లి : భూ సమస్యల పమస్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మండల తహశీల్దార్ జెఎస్.సుభాని అన్నారు. మండలంలోని చినపాలపర్రులో శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్, గ్రామ మొవ్వ జయలక్ష్మి, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ముసునూరు: ప్రతి ఒక్క రైతు తమ భూ సమస్యలన్నీటిని పరిష్కరించే విధంగా ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ తహశీల్దార్ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సూరేపల్లి గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. 12 మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు మస్తాన్ రావు, మణేంద్ర, హనిబాబు, నవీన్ బాబు, యశోద, విజయ్ కుమారి, రవికాంత్, హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

భీమడోలు : చెట్టున్న పాడు, మల్లవరం రెవెన్యూ గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తొమ్మిది వినతులు వచ్చినట్లు భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి తెలిపారు. దీనిలో భాగంగా పట్టాదారుల పాస్ పుస్తకాలకు చెందిన రెండు, మ్యూటేషన్‌కు చెందిన మూడు దరఖాస్తులతో పాటు, సర్వేకు సంబంధించి నాలుగు వినతులు వచ్చాయన్నారు. రెండవ విడత రీ సర్వే కోసం ఫైలట్ గ్రామంగా ఎన్నికైన మండలంలోని సూరప్పగూడెం గ్రామంలో శనివారం అవగాహనా ర్యాలీ, గ్రామసభ నిర్వహించనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కిరణ్ కుమారి, సర్వేయర్ ధర్మారావు, భీమడోలు ఎస్‌ఐ సుధాకర్, గ్రామ రెవెన్యూ అధికారులు దీనరాజు, శంకర్ పాల్గొన్నారు.

'హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి'

చింతలపూడి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అన్ని విధాలుగా ఆయువుపట్టుగా వున్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వైద్య ఉద్యోగులందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. రాఘవపురం పిహెచ్‌సి ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో 'వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు కావాలి.. పిహెచ్‌సిలకు రావాలి!' అనే నినాదంతో జరిగిన కార్యక్రమంలో వైద్య ఉద్యోగులందరూ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్ మద్దతుతో వైద్య ఉద్యోగులందరి సంయుక్త సహకారంతో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కోవిడ్ వంటి ప్రళయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేయండంలోనూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో అంటువ్యాధులు ప్రభలకుండా తక్షణ సేవల్లోనూ, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులోనూ హెల్త్ అసిస్టెంట్ల పాత్ర ప్రధానమైందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసమే కాకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందించే ప్రాథమిక వైద్యాలయాల్లో అన్ని విధాల సహాయకులుగా హెల్త్ అసిస్టెంట్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. ఇలా ఎన్నో విధాలుగా గ్రామీణ స్థాయిలో ఆరోగ్యరంగానికి మూల స్థంభాలైన హెల్త్ అసిస్టెంట్లను కోర్టు ఆదేశాల సాకుతో ఒక్కసారిగా గొంతు కోసి, ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి పీకేసి నట్టేట ముంచేయడం తీవ్ర అన్యాయమన్నారు. ఇరవై రెండేళ్ల పాటు సదీర్ఘ సర్వీస్ చేసి 50 ఏళ్లు దాటిన వయసులో ఉద్యోగం నుంచి బయటకు గెంటెస్తే, ఆ ఉద్యోగులపై ఆధారపడ్డ కుటుంబాలు బ్రతికేదెలా, ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదని బాధిత హెల్త్ అసిస్టెంట్లు కన్నీరు మున్నీరవ్వడం పట్ల వైద్య ఉద్యోగులందరూ తీవ్రంగా స్పందించారు. తక్షణమే ప్రభుత్వం కలగజేసుకుని తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు పిహెచ్‌సిల నుంచి మెయిల్ ద్వారా సమాచారంతో ఉద్యోగులందరూ కోరారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిరణ్ చైతన్య, డాక్టర్ దొరసానమ్మ, సిహెచ్‌ఒ పి.రవి కుమార్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్‌లు షాజహాన్, ఎస్.గోపి కిషోర్, కె.శ్రీనివాసరావు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

రైతుల గుండెల్లో తుపాన్

ప్రజాశక్తి - ముదినేపల్లి

అల్పపీడనం ప్రభావంతో వాతావరణంలో మార్పులు వచ్చి మండలంలో శుక్రవారం కూడా మోస్తరు వర్షం కురిసింది. వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేయడంతో రైతుల్లో కలకలం మొదలయ్యింది. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులు పొలాల వైపు పరుగులు పెట్టారు. వందలాది ఎకరాల్లో నేలమట్టమైన వరి పైరు పొలాల్లో ఉంది. రోడ్లు వెంబడి, బహిరంగ ప్రదేశాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. మండలంలో ఇంకా 2వేల ఎకరాల్లో వరిపైరు ఇంకా పొలాల్లోనే ఉంది. పలు గ్రామాల్లో నేలమట్టమైన వరి పైరును కోయాల్సి ఉంది. నేలకొరిగిన పైరు ఇప్పటికే పాడైపోయినట్లు రైతులు చెబుతున్నారు. వర్షం కురిస్తే నేలమట్టమైన పైరును పొలాల్లో వదిలేయటం తప్ప చేసేదేమీ లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస తుపానులు, వాయుగుండలతో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పైరు పసిరిగా ఉంది. దీంతో వర్షం పడితే పంట చేతికి దక్కే అవకాశం ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు వారాలుగా వాతావరణం మబ్బులుగా ఉండి మండలంలో చిరుజల్లులు పడుతున్నాయి. రోడ్ల వెంబడి ధాన్యాన్ని ఆరబెట్టి, తేమశాతం తగ్గించి గిట్టుబాటు ధర పొందేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు ఎండలు రాక ధాన్యం ఆరకపోవడంతో విఫలమవుతున్నాయి. ప్రస్తుతం మళ్లీ తుపాన్ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. వాతావరణం అనుకూలంగా లేక రైతులు మధ్య దళారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. రైతుల ఆదుర్తిని ఆసరాగా చేసుకున్న దళారులు తేమ శాతం పేరుతో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో బస్తాకు ఆదనంగా ఐదు నుంచి ఏడు కేజీల వరకు రైతులు నష్టపోతున్నారు. ఆరుగాలం పంట పండించిన రైతులను దళారులు నిలువునా దోచేస్తున్నారు. తేమశాతం వంకతో రైతులకు కటింగ్‌లు పెడుతున్నారు. ఒకపక్క తుపానులు, మరో పక్క మధ్య దళారుల మోసాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.